క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

నింద్ర: మండల కేంద్రంలో ఏపీటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను సంఘం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. మండల విద్యాశాఖాధికారులు వసుమతి, శ్రీధర్ రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి రుద్రమూర్తి, మండల అధ్యక్షుడు మునిరత్నం, మండల ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు చంద్రబాబు, కృష్ణమూర్తి, దీనా పాల్గొన్నారు.

వైభవంగా కాలభైరవాష్టమి పూజలు



పుష్పాలంకరణలో శ్రీకాళభైరవస్వామి

నగరి : పట్టణ పరిధిలోని శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలోని శుక్రవారం అష్టమి పూజల్లో భాగంగా శ్రీ కాలభైరవ స్వామికి పుష్పాలంకరణ సేవ వైభవంగా జరిగింది. కాలభైరవ స్వామికి పంచామృత అభిషేకం చేశారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరణ చేసి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.


పండ్ల తోటలకు వంద శాతం సబ్సిడీ

యాదమరి: ఉపాధి హామీ పథకంలో పండ్లతోటలు పెంచేందుకు వందశాతం సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించనున్నట్లు యాదమరి ఏపీఓ బాల తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో 2024–25 సంవత్సరానికిగాను ఉపాధిహామీ పథకంలో పండ్ల తోటలు పెంచుకోవడానికి, పంట వేసిన తరువాత కాపలాదారులకు, పండ్ల మొక్కలకు నీరు పోయడానికి వంద శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ పథకాలకు 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు, రేషన్ కార్డు కలిగి ఉన్నవారు ఫీల్డ్ అసిస్టెంట్‌ల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 59,522 మంది స్వామివారిని దర్శించుకోగా 18,544 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.51 కోట్లు సమర్పించారు. టికెట్లు లేని భక్తులకు దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది.

ఆపస్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నూతన డైరీని డీఈఓ విజయేంద్రరావు శుక్రవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ ఆపస్ రూపొందిన డైరీ, క్యాలెండర్ బాగున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజి, జిల్లా అధ్యక్షులు మంజునాథగుప్త, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, గౌరవాధ్యక్షులు మేకల సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

లఖ్‌పతి దీదీ యోజనపై అవగాహన

నారాయణవనం: మహిళల ఆర్థిక సాధికారికతకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న లఖ్‌పతిదీదీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. శుక్రవారం కమ్యూనిటీ భవనంలో డ్వాక్రా మహిళలు, సంఘమిత్రలతో సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకునేందుకు మహిళలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఇప్పటికే డ్వాక్రా సంఘ సభ్యులకు బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల వరకు రుణాలుగా అందుతోందని అన్నారు. ఏపీఎం మమత మాట్లాడుతూ లఖ్‌పతి దీదీ పథకం కింద బ్యాంకుల నుంచి ఒక్కో మహిళా సభ్యురాలు రూ.లక్ష వరకు రుణాన్ని పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో గుణశేఖర్, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం



లబ్ధిదారులకు వైఎస్సార్ నూతన పింఛన్‌లు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న విద్యార్థులు

- ఏపీలోనే అత్యధిక పింఛన్ల పంపిణీ
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): పేదల సంక్షేమం కోసం తపించే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. పెనుమూరులో శుక్రవారం కొత్త పింఛన్లను పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చిన 2019 నుంచి పింఛన్ ఏటా రూ.250 పెంచుతూ ఇప్పుడు రూ.3వేలు అందిస్తున్నామని చెప్పారు. పిల్లల చదువుకు అమ్మఒడి, జగనన్న కిట్టు, విద్యాదీవెన, వసతి దీవెనతో పాటు ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దింది కేవలం జగనన్న ప్రభుత్వమేనని గుర్తు చేశారు. పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని అందించే బృహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. కాపు నేస్తం పథకం ద్వారా రూ.15 వేలు అందించి కాపులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను గెలిపించి ఈ సంక్షేమ పథకాలను మళ్లీ అందుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, మనోహర్, నవీన్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దాము, జేసీఎస్ హరికృష్ణ, యతీశ్వర్‌నాయుడు, మురళీ, రామకృష్ణారెడ్డి, లక్ష్మీపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే మళ్లీ పట్టం

కార్వేటినగరం: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపీపీ లత అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీరాజపేట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిన్న, ఎంపీటీసీ మురగయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నూతన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ లత ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో 99 శాతం హామీలను నెరవేర్చారని, రానున్న ఎన్నికల్లో జగనన్నమరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం మహిళలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ పాల్గొన్నారు.



లక్ష్మీరాజపేటలో నూతన పెన్షన్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ లత

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి : నియోజకవర్గంలో శనివారం పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్కేరోజా పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు నగరి బైపాస్ రోడ్‌లో ఎంపీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న నగరి ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. అనంతరం నింద్ర మండల పరిషత్ కార్యాలయంలో రూ. 3 వేలు పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

హుండీ ఆదాయం రూ.6.19 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

నగరి : నేత్రదేవత శ్రీదేశమ్మ ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.6.19 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ వేణుబాబు, ఈవో రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో 95 రోజుల హుండీ కానుకలను లెక్కించారు. నోట్ల రూపంలో రూ.5.34 లక్షలు, నాణేల రూపంలో రూ.85 వేలు లభించినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ వేంకటేశులు, సెక్యూరిటీ లోకనాథం, ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం : వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ ఢిల్లీప్రసాద్ తెలిపారు. సీఎం కండ్రిగలో శుక్రవారం వైఎస్సార్ పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను తగిన మోతాదులో వాడాలన్నారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోతోందని చెప్పారు. ఇందుకోసం పచ్చిరొట్టను సాగు చేసుకోవాలని సూచించారు. పశువుల పేడతో భూములు సారవంతమవుతాయని స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతులు భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. పంటలకు తెగుళ్లు సోకినప్పుడు వ్యవసాయాధికారి సూచనల మేరకు పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు.

పండుగలా వైఎస్సార్ పింఛన్ల పంపిణీ

నగరి: పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి అవ్వతాతలకు ముఖ్యమంత్రి పింఛన్ అందిస్తుండడంతో వాడ వాడలా పెన్షన్ల జాతర జరుగుతోంది. ప్రతి వార్డుల్లో పండుగ వాతావరణంలో కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు వలంటీర్లతో కలిసి పెన్షన్లను అందిస్తున్నారు. అవ్వతాతలు వాడవాడలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆనందంతో ఆశీస్సులు అందిస్తున్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎంపీపీ శ్యామల, మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో మండలంలోని లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ఏకాంబరకుప్పంలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న వృద్ధులు





మిట్టపాళెంలో నూతన పెన్షన్ అందిస్తున్న సర్పంచ్, గుడికంద్రిగలో పెన్షన్‌ను చూపుతున్న వృద్ధులు

యువతకు క్రీడా ప్రోత్సాహం



వాలీబాల్ క్రీడాకారులకు దుస్తులు అందిస్తున్న సర్పంచులు

పాలసముద్రం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ద్వారా గ్రామీణ యువతకు ప్రోత్సాహం అందిస్తోందని సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, మహేష్ తెలిపారు. మండలంలోని శ్రీకావేరిరాజుపురం సచివాలయ పరిధిలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో పోటీల్లో మండల స్థాయికి ఎంపికైన యువకులతో ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో ఓటమి, గెలుపు సహజం అందువలన ప్రతి క్రీడలను అన్నదమ్ములా కలసి మెలసి ఆడాలన్నారు. వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయంలో ఖోఖో పోటీల్లో మండల స్థాయికి ఎంపికైన మహిళలకు క్రీడా దుస్తులను సర్పంచ్ లిల్లీ, వైస్ ఎంపీపీ పుష్ప పంపిణీ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మహిళలకు దుస్తులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు లిల్లీ, పుష్ప

జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

కార్వేటినగరం: గ్రామీణ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఎంపీపీ లత పిలుపునిచ్చారు. ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శుక్రవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని అందించారు. ఎంపీపీ లత మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలోని క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం–ఆంధ్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, ఈవో మణి, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని అందిస్తున్న ఎంపీపీ లత

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

పుత్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద కుటుంబాలకు వరమని వడమాలపేట జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు అన్నారు. శుక్రవారం వడమాలపేట మండలం ఎస్వీఆర్‌పురం సచివాలయంలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది రోగులను పరీక్షించారు. హెల్త్ కార్డులు, కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు కనకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరామరాజు, మాధవరాజు, సుదర్శనవర్మ, డాక్టర్లు జ్యోత్స్న స్రవంతి, యుగంధర్, చైతన్య పాల్గొన్నారు.



హెల్త్ కార్డుల పంపిణీ

రూ.లక్ష విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి నిత్యఅన్నదానానికి తిరుపతికి చెందిన సతీష్ రూ.లక్ష విరాళంగా అందించారు. దాత కుటుంబ సమేతంగా శుక్రవారం సాయంత్రం స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అధికారుల వద్ద స్వామివారి నిత్య అన్నదానానికి రూ.లక్ష అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు పది పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పరీక్షల సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడీ నెల్లూరు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి షకీలా, మండల విద్యాశాఖాధికారి ఆంజనేయులు శెట్టి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమలత, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



విద్యా సామగ్రి అందజేస్తున్న అధికారులు

వరసిద్ధుని సేవలో సినీ నటుడు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సినీ నటుడు గరుడ రామచంద్రరాజు శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన స్వామివారి దర్శనార్థం కుటుంబంతో విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి, స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్, వేదికపై పవిత్రారెడ్డి

రేణిగుంట(శ్రీకాళహస్తి) : పట్టణంలో విక్రమ్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆల్ ఇండియా సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ క్రీడలను డాక్టర్ చంద్రశేఖర్ పర్యవేక్షిస్తున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శ్రీకాళహస్తిలో ఇలాంటి టెన్నిస్ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. 70 సంవత్సరాలు పైబడిన వారు పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, విశ్రాంత న్యాయమూర్తి రామకృష్ణ, డీఎస్ఎన్ రాజు, దశరథ, దామోదరం, మన్మథరావు, రవి, ధనుంజయులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

కేవీబీపురం: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ సోమవారం నుంచి కార్యాలయం బయటే స్పందన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పందనలో వస్తున్న అర్జీలపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన అర్జీలు ఇచ్చి సమస్య పరిష్కారం కాకుండా ఉంటే ఈ సోమవారం అందజేయాలని తహసీల్దార్ సూచించారు.